సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం ♦ 23 ♦ ఏప్రిల్ ♦ 2025



రాయితీ ఇచ్చినా..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్ను మొత్తం చెల్లిస్తేనే 5 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించినా ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. 8లో ▸



మండుతున్న ఎండలతో జాగ్రత్త

ఎండలు మండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎండలు, వడగాడ్పులు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. 8లో ▸



ఈవీల చోరీ ముఠా అరెస్టు

ఎలక్ట్రిక్ స్కూటర్లు చోరీ చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి విజయవాడ పోలీసులు 22 ఎలక్ట్రిక్ స్కూటర్లు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మొదటి అదనపు సివిల్ జడ్జిగా లలితాదేవి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం మొదటి అదనపు సివిల్ జడ్జిగా కె.లలితాదేవి నియమితులయ్యారు. విశాఖ ఏడో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (స్పెషల్ మొబైల్ కోర్టు) నుంచి బదిలీపై వస్తున్నారు. పట్టణంలో మొదటి అదనపు సివిల్ జడ్జిగా ఉన్న డి.అరుంధతి గుడివాడ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ అయ్యారు.

వేతన బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు తక్షణం విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం ఉపాధి హామీ కూలీల సమస్యలపై ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా ఉపాధి కూలీల వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుమారు రూ.25.42 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ వేయడం వల్ల కూలీలు ఫొటో దిగడం కోసం అనేక కిలోమీటర్ల నడవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి, షేక్ పాదుషా, గుబ్బల నాగేశ్వరరావు, సోడదాసి సంజీవరావు, కానేటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలు అరికట్టాలని, దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లా దెందులూరులో మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టిని తవ్వి రూ.కోట్లు సంపాదిస్తోందని, అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యం చేస్తోందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సంఘటనే అందుకు సాక్ష్యమని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దాసరి బాబురావు భార్య నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం చల్లచింతలపూడిలో తన పొలం నుంచి అక్రమంగా మట్టి తీసుకెళ్తున్న వారిని బాబూరావు అడ్డుకుంటే దౌర్జన్యంగా అతను కారులో ఉండగానే పొక్లెయిన్‌తో కారును పైకెత్తి గుంటలో పడేశారని.. దీని బట్టి పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. దాసరి బాబురావు, అతని భార్య జిల్లా అధికారులు, పోలీసులు, లోకేషను కలిసి చెప్పుకున్నా సమస్య పరిష్కారం కాలేదని.. దీంతో మట్టి మాఫియా ఎంత బలంగా ఉందో తెలుస్తోందని స్పష్టం చేశారు. బాబురావు టీడీపీ కార్యాలయంలో ఆత్మహత్య యత్నం చేశారని, ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాబూరావు భార్య తెలిపారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

గోనె సంచుల కొరతపై ఫిర్యాదు



యండగండిలో జేసీతో మాట్లాడుతున్న రైతులు

ఉండి: ధాన్యం అమ్మకంలో గోనె సంచుల కొరత ఉందని, రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఉండి మండలం యండగండి రైతు సేవా కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. ధాన్యం అమ్మకానికి రైతులంతా సిద్ధంగా ఉన్నారని.. అయితే గోనె సంచుల కొరత ఉందని రైతులు చెప్పారు. దీనిపై స్పందించిన జేసీ రైసుమిల్లర్లతో నేరుగా మాట్లాడి రైతులకు 20 వేల గోనె సంచులు వెంటనే అందుబాటులో ఉంచాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రైతులతో కలసి తేమశాతం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు అధికారులు సహకరించకపోతే తెలియచేయాలని సూచించారు. మిల్లుకు ధాన్యం తోలిన 48 గంటల వ్యవధిలోనే రైతు ఖాతాలో నగదు జమచేస్తామన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు.

పెట్టుబడి సాయానికి ఎగనామం

- అన్నదాత సుఖీభవ ఊసెత్తని కూటమి
- ఈ సీజన్‌లో రూ.235.99 కోట్ల సాయాన్ని నష్టపోయిన రైతులు
- ఉచిత పంటల బీమాను ఎత్తివేయడంతో రైతుపై రూ.14 కోట్ల భారం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు రూ.796.49 కోట్ల సాయం

గత ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	ప్రభుత్వం సాయం (రూ.కోట్లలో)
2019–20	1,09,302	147.56
2020–21	1,24,664	168.3
2021–22	1,17,791	159.02
2022–23	1,13,597	153.36
2023–24	1,24,645	168.17

సాక్షి, భీమవరం: కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తామన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. సాగు పెట్టుబడుల కోసం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామన్నారు. పాలన చేపట్టడమే ఆలస్యం.. ఏటా రూ.20,000 చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామంటూ కూటమి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఊదరగొట్టారు. కూటమి పాలన చేపట్టి అప్పుడే 11 నెలలు కావస్తోంది. 2024–25 సీజన్‌కు పీఎం కిసాన్ సాయాన్ని కేంద్రం ఎప్పుడో రైతుల ఖాతాలకు జమ చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం 'అన్నదాత సుఖీభవ' అమలు ఊసెత్తడం లేదు. ఈ సీజన్‌లో రూ.20 వేల చొప్పున అందాల్సిన సాయాన్ని నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలోని 2.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్, 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగవుతున్నాయి. 2024–25 వ్యవసాయ సీజన్‌లో రైతులకు కలిసి రాలేదు. భారీ వర్షాలు, వరదల రూపంలో సాగు ప్రారంభంలోనే 38 వేల ఎకరాల్లోని పంట దెబ్బతిని రెండోసారి నాట్లు వేయాల్సి వచ్చింది. చివర్లో ఫెంగల్ తుఫాన్ కంటి మీద కునుకు లేకుండా చేసింది. తేమ శాతం పేరిట దళారులు, మిల్లర్లు బస్తాకు రూ.300 వరకు కోతపెట్టి రైతుల కష్టాన్ని దోచుకున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా 30 బస్తాల లోపే వచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు డబ్బుల్లేక రబీ సాగు ఆలస్యమైంది. ఎరువుల ధరలు బస్తాకు రూ. 50 నుంచి రూ. 230 వరకు పెరగడంతో ఎకరాకు రూ. 500 వరకు అదనపు భారం పడింది. ప్రతికూల వాతావరణంతో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువై సాగు పెట్టుబడులు పెరిగిపోయాయి.



గతంలో సాగుకు ముందే సాయం

వైఎస్సార్ రైతు భరోసాగా గత ప్రభుత్వంలో సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించేవారు. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6000కు రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 జతచేసి ఏటా రూ. 13,500 మొత్తాన్ని ఖరీఫ్ ప్రారంభం, కోతలు, రబీ ప్రారంభంలో మూడు విడతలుగా అందించేవారు. తొలి విడతగా మే నెలలో రూ.7500, ఖరీఫ్ చివరిలో రెండో విడతగా రూ.4000, రబీ ప్రారంభ సమయంలో మూడో విడతగా రూ.2,000 సాయం అందించేవారు. గత ఐదేళ్లలో 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్లు సాయం అందించారు.

సీజన్ ముగుస్తున్నా.. సుఖీభవ సాయం లేదు

ప్రస్తుతం జిల్లా అంతటా రబీ మాసూళ్లు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ రైతులు కోతలు, ధాన్యం ఆరబెట్టుకోవడం, పట్టుబడుల్లో నిమగ్నమయ్యారు. మరో రెండు మూడు వారాల్లో రబీ తుది దశ పనులు పూర్తి కానుండగా అన్నదాత సుఖీభవ సాయం విడుదలపై పాలకులు నోరు మెదపడం లేదు. కూటమి ప్రభుత్వం చేసిన దగాతో ఈ ఏడాది ఒక్కో రైతు రూ. 20 వేలు చొప్పున జిల్లాలోని దాదాపు 1,17,999 రైతులు రూ.235.99 కోట్లు నష్టపోతున్నట్టు అంచనా.

పంటల బీమాకు ఎసరు

అన్నదాత సుఖీభవ సాయం అందించకపోగా ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ఎసరుపెట్టింది. ఎకరాకు రూ.615 చొప్పున రబీ నుంచి ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరగగా.. ప్రీమియం రూపంలో జిల్లా రైతులపై రూ.14.15 కోట్ల భారం పడింది. గత ఐదేళ్లలో దాదాపు రూ.140 కోట్ల ప్రీమియం సొమ్మును రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీమా కంపెనీలకు చెల్లించడం గమనార్హం.

దళారులను ఆశ్రయిస్తున్నాం



నేను మూడెకరాలు కౌలుకు చేస్తున్నాను. రైతులకు అందిస్తామన్న పెట్టుబడి సాయం ఇంతవరకు ఇవ్వలేదు. పెట్టుబడుల నిమిత్తం దళారులను ఆశ్రయించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి పూర్తి అగమ్యగోచరంగా తయారైంది.

– తామరపల్లి మునలయ్య, కౌలు రైతు, పద్దిరెడ్డిపాలెం

ఒక్క రూపాయి కూడా సాయం లేదు



ఎకరం సొంత భూమితోపాటు 4 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. గత ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా సాయం అందించేవారు. ఏడాది కాలంగా ఒక్క రూపాయి అందలేదు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

– కోరుకొల్లు వెంకట్రావు, రైతు, కంచుమర్రు

ఏడాది గడిచినా సాయం ఊసే లేదు



అన్నదాత సుఖీభవగా ఏటా రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అప్పుడే ఏడాది కావస్తోంది. ఇంతవరకు సాయం ఊసు ఎత్తడం లేదు. చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నాం.

– గుంటపల్లి వెంకన్న, రైతు, గరగపర్రు

రెచ్చిపోయిన చింతమనేని



సాక్షి కార్యాలయంలో ధ్వంసమైన కంప్యూటర్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు ఎస్‌ఆర్ పేటలోని సాక్షి జిల్లా కార్యాలయం వద్ద చింతమనేని ప్రభాకర్‌తో పాటు అతని అనుచరులు మంగళవారం మధ్యాహ్నం హల్‌చల్ చేస్తూ గందరగోళం సృష్టించారు. వంద మందికిపైగా టీడీపీ నేతలు, కార్యకర్తలతో హంగామా చేశారు. సాక్షి కార్యాలయంలో కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐలు కోటేశ్వరరావు, అశోక్ కుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పలువురు ఎస్సైలు, ఏఆర్ పోలీస్ సిబ్బంది సాక్షి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పోలీస్ సిబ్బంది రోప్ తీసుకువస్తుండగా ఎందుకు తీసుకువస్తున్నారని టీడీపీ కార్యకర్త ఒకరు ప్రశ్నించాడు. నీకెందుకని స్పెషల్ పార్టీ సిబ్బంది చెప్పి పక్కకు నెట్టడంతో టీడీపీ కార్యకర్త స్పెషల్ పార్టీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు.

వాస్తవం జీర్ణించుకోలేకే దాడి: బాలరాజు



బుట్టాయగూడెం: ఏలూరు సాక్షి జిల్లా కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తన అనుచరులు దాడిని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు రాసే పత్రికలపై అక్కసుతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అటు వైఎస్సార్‌సీపీ నాయకులపైన, వాస్తవాలు రాసే పత్రికలపైన కూటమి నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు.

ఉండిలో రాక్షస రారాజు పాలన

సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్



పాలకోడేరులో బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో ఈ ఆరు నెలల కాలంలో రాక్షస రారాజు పాలన సాగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. నియోజకవర్గంలో వందలాది పేదల ఇళ్లు తొలగించారని మండిపడ్డారు. ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్‌లో మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కూలగొట్టిన పేదల ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇకపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆటలు సాగనివ్వబోమని, ట్రిపుల్ ఆర్ అంటే రాక్షస రారాజు అని అర్థమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన పీ–4 ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో ఉందని విమర్శించారు. సంపన్నుల సహకారంతో పేదలను అభివృద్ధి చేయాలని చెబుతుంటే, ఇక్కడ మాత్రం పేదలను కొట్టి సంపన్నులకు ఆస్తులను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కల్చరల్ ప్రోగ్రాంలో వేసిన దుర్యోధన పాత్రని ఎమ్మెల్యే నియోజకవర్గంలో అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

భూములు పంచకుంటే భూ పోరాటానికి సిద్ధం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని, లేని పక్షంలో భూ పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. పేదల గుడిసెలు మాత్రమే అధికారులకు, ఎమ్మెల్యేకు కనిపించాయా? భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది ఎకరాలు కనబడవా? అని ప్రశ్నించారు. భూస్వామ్య భావజాలంతో రఘురామకృష్ణరాజు అహంకార పాలన చేస్తున్నాడని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఎం సీనియర్ నేత మంతెన సీతారాం, కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, దూసి కళ్యాణి, మామిడి శెట్టి రామాంజనేయులు, కె.క్రాంతి బాబు, ధనికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత పోరు



పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిషప్ జయరావు పొలిమేర

ఏలూరు (టూటౌన్): రోమన్ క్యాథలిక్ అత్యున్నత మతగురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఏలూరు మేత్రాసన పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. మంగళవారం బిషప్ హౌస్‌లో పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. పోప్ ఫ్రాన్సిస్ అందించిన సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం కోసం, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పోప్ ఫ్రాన్సిస్ అవిశ్రాంతంగా పోరాటం చేశారని కొనియాడారు. ప్రొక్యురేటర్ ఫాదర్ బి.రాజు, మైకేల్ చర్చ్ ఫాదర్ దిరిసిన ఆరోన్, ఏలూరు వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, అమలోద్భవి కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ ఐ.మైఖేల్ పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏలూరు సాక్షి కార్యాలయంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడిని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. పత్రికలో వచ్చిన వార్తలపై అభ్యంతరాలు ఉంటే వివరణ ఇచ్చి సవరణ కోరాలని.. ఇలా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి, మీడియా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు అని జిల్లా కమిటీ సభ్యులు తప్పు పట్టారు. ప్రజాస్వామ్య వాదులు, మీడియా స్వేచ్ఛను, భావ ప్రకటన స్వేచ్ఛను ఆకాంక్షించే వారంతా ఈ దాడిని తీవ్రంగా ఖండించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీఎస్ సాయిబాబా, గజపతి ప్రసాద్ కోరారు.

ప్రజాస్వామ్యానికి మచ్చ



ఎస్‌కే అజాద్

చింతలపూడి: పత్రికా స్వేచ్ఛను అడ్డుకుంటూ దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, ఇలాంటి సంఘటనలు చెడు సంప్రదాయానికి బీజం వేస్తాయని ఏపీయుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే అజాద్ అన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని, జర్నలిస్టులు ఇలాంటి సంఘటనలపై ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

కలగానే ఫిషింగ్ హార్బర్

- కూటమి సర్కారు రాకతో అటకెక్కిన పనులు
- రూ.429.43 కోట్లతో నిర్మాణానికి శ్రీకారం చుట్టిన జగన్ సర్కార్
- గత 9 నెలల్లో ఒక్క అడుగూ ముందుకు పడని వైనం



హార్బర్ లేక గోదావరి గట్టున నిలిపి ఉంచుతున్న బోట్లు

నరసాపురం: నరసాపురంలో దశాబ్దాల కలగా ఉన్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కలగానే మిగిలిపోనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జిల్లాకు మంజూరు చేసిన ఈ భారీ ప్రాజెక్టు గత 9 నెలలుగా పడకేసింది. ఎన్నికలకు ముందు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యి, పనులు ప్రారంభమవుతాయనుకున్న సమయంలో.. నేడు హార్బర్ నిర్మాణం ఇక లేనట్టే అన్న చందంగా మారిపోయింది. గోదావరి జిల్లాలకు మణిహారంగా నరసాపురంలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఈ హార్బర్ నిర్మాణానికి 2022 మే నెలలో ఏపీ మారిటైం బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. అప్పటి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు వచ్చాయి. టెండర్లు పిలవడంతో విశ్వ సముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. రూ.429.43 కోట్లతో నిర్మించే హార్బర్‌కు సంబంధించిన ప్రాథమిక పనులు 2023, ఫిబ్రవరిలో ప్రారంభించారు.

మత్స్య ఎగుమతులు పెంచే లక్ష్యంతో..

తీరప్రాంతంలో సముద్ర మత్స్య సంపదతో భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. కానీ హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హార్బర్ నిర్మాణానికి పూనుకుంది. బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో నిర్మించతలపెట్టి పనులు మొదలుపెట్టారు. అయితే కూటమి సర్కార్ ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించింది.

హార్బర్ నిర్మాణం పూర్తి చేయించాలి



బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం ఖర్చు భరించేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం చేశారు. టెండర్లు పిలిచి, పనులు విశ్వసముద్ర సంస్థకు అప్పగించాం. పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. నిర్మాణం చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వం మీద ఉంది. నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి.

ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కూటమి సర్కారు రాకతో సీన్ రివర్స్

కూటమి సర్కారు వచ్చిన తరువాత ఈ ప్రాజెక్టు అంశంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడం, ప్రాథమికంగా పనులు ప్రారంభం కావడం జరిగింది. కూటమి సర్కారు గద్దెనెక్కిన తరువాత పనులు చేపట్టడంలో విశ్వసముద్ర సంస్థ వెనకడుగు వేసినట్టు సమాచారం. ఈ అంశంపై కూటమి ప్రభుత్వం ఓ ప్రకటన కూడా చేయలేదు. దీంతో అసలు హార్బర్ సాకారమవుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. 19 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది.

ఈ సారి మన స్థానం ఎక్కడో ?

నేడు 'పది' ఫలితాలు విడుదల

సాక్షి, భీమవరం: పదోతరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలకానున్నాయి. ఉదయం 10 గంటల సమయానికి ఫలితాలు వెల్లడించనున్నట్టు విద్యాశాఖ ప్రకటించింది. జిల్లా నుంచి 24,909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఫలితాల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి మార్చి 17 నుంచి 31వ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 24,393 మంది ఓపెన్ స్కూల్స్ నుంచి, 516 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 135 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. బుధవారం ఉదయం ఫలితాలు విడుదల కానున్నాయి. 9552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేసి లేదా వెబ్‌సైట్లలో ఫలితాలను చెక్ చేసుకోవచ్చునని విద్యాశాఖ సిబ్బంది తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో 20,268 విద్యార్థులు హాజరుకాగా 13,362 మంది పాసయ్యారు. 65.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో జిల్లా 21వ స్థానంలో నిలిచింది. 2023–24 విద్యా సంవత్సరంలో 20,785 మంది విద్యార్థులు హాజరుకాగా 81.82 శాతంతో 23వ స్థానంలో నిలిచింది.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్య

- 5 ఏళ్లు నిండిన వారికి ఒకటో తరగతిలో ప్రవేశం
- ఈ నెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తుకు అవకాశం



భీమవరం: ప్రైవేటు స్కూళ్లలో తమ పిల్లలను చదివించాలనే పేదల కోరిక నెరవేర్చేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిని కొనసాగింపుగా ఇప్పుడు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరడానికి ఈనెల 28వ నుంచి దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించారు. జిల్లాలో 2023లో 1,162 మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో సీట్లు దక్కించుకోగా 2024లో 1,163 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తల్లికి వందనం పథకంలో అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ అమలుచేయకపోవడంతో ఇప్పుడు పేదలు ఫీజుల భారం తగ్గించుకోడానికి ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యనైనా పొందాలని ఎదురుచూస్తున్నారు. ఒకటో తరగతిలో ప్రైవేటు స్కూల్స్‌లో చేరే విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది. గతంలో ఉన్నత వర్గాలకు మాత్రమే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదువుకునే పరిస్థితి ఉండగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులకు ఖర్చులేకుండా చదువుకునే అవకాశం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 705 ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకుగాను ఒకటో తరగతిలో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలి. ముందుగా ఆయా స్కూల్స్ ఉచిత విద్యకు రిజిస్టర్ చేయించుకోవాలి. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను ఆడ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం ఇవ్వాల్సి ఉంది.

ఫీజులు వసూలు చేస్తే చర్యలు



ఈ నెల 28 నుంచి మే 15 లోగా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులను లాటరీ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేస్తాం. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసే స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం.

– పి శ్యామ్‌సుందర్, జిల్లా సమగ్రశిక్షా అదనపుప్రాజెక్టు కోఆర్డినేటర్, భీమవరం

క్లుప్తంగా

మద్ది క్షేత్రంలో భక్తుల రద్దీ



గుర్వాయిగూడెంలో స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. ముందుగా స్వామి వారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి ప్రభాత సేవ మొదలుకుని, నిత్యకైంకర్యాలతో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఏలూరు జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ సూర్యచంద్రరావు దర్శించుకున్నారు. వారి వెంట లక్కవరం ఎస్సై శశాంక ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,66,246 సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

మావుళ్లమ్మకు 200 గ్రాముల బంగారం సమర్పణ



200 గ్రాముల బిస్కెట్‌ను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందిస్తున్న దాతలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మావుళ్లమ్మ వారికి బంగారు వస్తువుల తయారీకి మంగళవారం భీమవరం పట్టణానికి చెందిన ఇన్నమూరి యోగ శివాన్ష్, వేదన్ష్, పి.హర్షిల్ 200 గ్రాముల బంగారు బిస్కెట్లు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. అయితే ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి గణేష్ మాట్లాడుతూ 200 గ్రాముల బంగారం సంబంధించి అమ్మవారి సన్నిధిలో వస్తువుల తయారీకి అందించారని, ఈ బంగారం సంబంధించి దేవస్థానం నుంచి ఎలాంటి రసీదు గాని, రికార్డుల్లో నమోదు చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, ఐ.కృష్ణారావు దంపతులు, స్వర్ణ వస్త్ర నిధి సేకరణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్.. రూ.10 వేల జరిమానా

భీమవరం: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముద్దాయికి రూ. 10 వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు మంగళవారం చెప్పారు. పట్టణానికి చెందిన నెలపర్తి ప్రెక్షన్ మద్యం సేవించి మోటారుసైకిల్ నడుపుతుండగా అదుపులోనికి తీసుకుని భీమవరం స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం హాజరు పర్చారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ ఎంవీఎస్ రాజారావు జరిమానా విధించారని నాగరాజు చెప్పారు.

రాయితీ ఇచ్చినా రాబడి అంతంతే

- ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపును పట్టించుకోని ప్రజలు
- మరో వారమే గడువు

నూజివీడు: మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో ముందస్తుగానే ఆస్తి పన్ను మొత్తం చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం రాయితీపై ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఏప్రిల్ 30లోగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను బకాయిలను ఏకమొత్తంలో ఒకేసారి చెల్లిస్తే 50 శాతం రాయితీని ఇస్తూ బకాయిదారులకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం ఎంత అవకాశం కల్పించినా పన్నుదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మరో వారం రోజుల్లో (ఏప్రిల్ 30)తో గడువు ముగియనుంది. ఏలూరు జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలలో పది శాతం మాత్రమే ముందస్తుగా వసూలు కాగా, పశ్చిమగోదావరి జిల్లాలోని పలు మున్సిపాలిటీలలో 13 శాతం నుంచి 15 శాతం ఆస్తి పన్ను ముందస్తుగా వసూలైంది.

ప్రచారం ఏది?

ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ముందుగానే చెల్లిస్తే ఐదు శాతం రాయితీ లభిస్తుందన్న విషయాన్ని పెద్దగా ప్రచారం చేయలేదు. దీంతో చాలా మంది ప్రజలకు తెలియకపోవడం, అరకొరగా రాయితీ ఇవ్వడం కూడా వసూళ్లు మందగించడానికి ఐదు శాతం మాత్రమే రాయితీ ఇవ్వడం వల్ల కూడా తక్కువ మొత్తం ఆస్తి పన్ను చెల్లించే వారు దీని గురించి పట్టించుకోలేదు. పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించే వారే రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. పది శాతం వరకు రాయితీ ఇస్తే దాదాపు 40 నుంచి 50శాతం వరకు వసూలై ఉండేదని పురపాలక సంఘం వర్గాలే పేర్కొంటున్నాయి.



నూజివీడు పురపాలకసంఘు కార్యాలయం

మున్సిపాలిటీ	మొత్తం అసెస్‌మెంట్‌లు	డిమాండ్	వసూళ్లు
ఏలూరు	70461	రూ.48.90 కోట్లు	రూ.5.33 కోట్లు
జంగారెడ్డిగూడెం	14651	రూ.08.47 కోట్లు	రూ.0.88 కోట్లు
నూజివీడు	13732	రూ.07.16 కోట్లు	రూ.0.83 కోట్లు
చింతలపూడి	7262	రూ.02.58 కోట్లు	రూ.0.16 కోట్లు
భీమవరం	32130	రూ.25.57 కోట్లు	రూ.3.58 కోట్లు
తాడేపల్లిగూడెం	25508	రూ.16.49 కోట్లు	రూ.2.02 కోట్లు
తణుకు	21450	రూ.15.28 కోట్లు	రూ.2.29 కోట్లు
పాలకొల్లు	15092	రూ.08.68 కోట్లు	రూ.1.08 కోట్లు
నర్సాపురం	14800	రూ.07.92 కోట్లు	రూ.0.71 కోట్లు
ఆకివీడు	8048	రూ.03.42 కోట్లు	రూ.0.27 కోట్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వసూళ్లు ఇలా

ఏలూరు జిల్లాలో ఆస్తి పన్నును అత్యధికంగా వసూలు చేసి ఏలూరు కార్పొరేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ డిమాండ్ రూ.49 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.5.40 కోట్లు వసూలైంది. చింతలపూడి నగర పంచాయతీలో డిమాండ్ రూ.2.58 కోట్లు కాగా ఇప్పటి వరకు కేవలం రూ.16లక్షలు మాత్రమే వసూలైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మున్సిపాలిటీలో రూ.15.28కోట్ల డిమాండ్‌కు గాను రూ.2.29 కోట్లు వసూలు చేసిప్రథమ స్థానంలో ఉండగా, ఆకివీడు నగర పంచాయతీ కేవలం రూ.27లక్షలు మాత్రమే వసూలు చేసి చివరి స్థానంలో ఉంది.

మండుతున్న ఎండలతో జనం బెంబేలు



ఎండలను తట్టుకోలేక నెత్తిన ముసుగులేసుకుని పనుల నుంచి వస్తున్న ఉపాధి కూలీలు

డాక్టర్ ఎండీ రసూల్

- క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

చింతలపూడి: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఎండలు ఇప్పుడే ఇంత తీవ్రంగా ఉంటే రోహిణీ కార్తె ప్రారంభమైతే ఇంకెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండే ఎండల నుంచి ఎలా కాపాడుకోవాలా అని ఆందోళన చెందుతున్నారు. పిల్లలను కోచింగ్‌లకు పంపాలన్నా, ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లాలంటేదడ, ఎక్కడ ఎండ దెబ్బకు బలైపోతామోనని భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ళల్లో నుండి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ తాకిడికి తట్టుకోలేక పోతున్నారు.ఈ పరిస్థితుల్లో ఎండలు, వడగాడ్పులు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రసూల్ సూచించారు. ఆ సూచనలు ఏంటో? ఓసారి తెలుసుకుందాం

ఎండల వల్ల వచ్చే వ్యాధులు

- వేసవి నేపథ్యంలో బ్యాక్టీరియా ఎఫెక్ట్ వల్ల పెద్దవారిలో సెగ్గెడ్డలు వచ్చే అవకాశాలు ఎక్కువ. దీనికి డాక్టర్ సలహాతో నోటితో తీసుకునే యాంటీబయోటిక్ మందులు వాడాలి.
- ఎండలకు జుట్టుపై ఉండే క్యూటికల్ పొర దెబ్బతిని జుట్టు సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. వేసవిలో ఎక్కువగా మసాలాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు.

వేసవిలో వాడాల్సిన దుస్తులు

- ఎండాకాలంలో వదులుగా ఉండే దుస్తులు వాడాలి. చెమటను పీల్చుకునే కాటన్ దుస్తులు వాడాలి.
- టైట్ జీన్స్ ప్యాంట్‌లు వాడకూడదు.
- తెల్లని దుస్తులు వాడితే మంచిది. నల్లని దుస్తులు వాడకుండా ఉంటే ఉత్తమం.
- చిన్నపిల్లలకు ఎక్కువగా వదులుగా ఉండే దుస్తులు వాడాలి.
- రంధ్రాలు ఉండే టోపీలను వాడితే జుట్టుకు చెమట పట్టకుండా ఉంటుంది.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవిలో రోజూ నాలుగు నీటర్ల కంటే ఎక్కువ నీరు తాగాలి. చిన్న పిల్లలు, వృద్ధులకు ఎక్కువ నీరు దఫదఫాలుగా ఇస్తూ ఉండాలి.
- మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకు రసం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.
- పిల్లలను ఎక్కువగా ఫ్యాన్ కింద ఉంచితే చర్మ వ్యాధులు రావు. ఆర్డినరీ టాల్కమ్ పౌడర్ వాడితే చెమట కాయల నుంచి రక్షణ పొందవచ్చు.
- పెద్దలకు చర్మ వ్యాధులు వస్తే యాంటీబయోటిక్స్ వాడాల్సి ఉంది.
- చల్లని ఏసీ ప్రదేశం నుంచి వెంటనే ఎండలోకి వెళ్లకూడదు. వేసవిలో బయటికి వెళ్లేటప్పుడు తప్పని సరిగా గొడుగు వేసుకోవాలి.
- ద్విచక్ర వాహన చోదకులు కళ్లకు కూలింగ్ కళ్లజోళ్లు, నెత్తిన టోపీ వాడాలి.

జిల్లాలో గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా

పట్టణం	గరిష్టం	కనిష్టం
22-04-2025		
జంగారెడ్డిగూడెం	42	25
ఏలూరు	42	25
నూజివీడు	42	26
21-04-2025		
జంగారెడ్డిగూడెం	41	26
ఏలూరు	42	25
నూజివీడు	41	26
20-04-2025		
జంగారెడ్డిగూడెం	38	28
ఏలూరు	37	29
నూజివీడు	37	27
19-04-2025		
జంగారెడ్డిగూడెం	40	27
ఏలూరు	39	27
నూజివీడు	39	27

లోయలోకి దూసుకెళ్లిన కారు

వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు మృతి



రవ్వారిగూడెం సమీపంలో లోయలోకి దూసుకెళ్లిన కారు



నాగరాజు (ఫైల్)

బుట్టాయగూడెం: మండలంలోని బూరుగువాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంజా నాగరాజు(45) మంగళవారం కారు ప్రమాదంలో మృతి చెందాడు. పులిరామునుగూడెం నుంచి రవ్వారిగూడెం మీదుగా అడ్డదారిలో కామయ్యకుంట వెళ్తున్న సమయంలో నాగరాజు డ్రైవింగ్ చేస్తున్న కారు లోయలోకి దూసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆ సమయంలో స్టీరింగ్ నాగరాజు శరీరానికి గుద్దుకోవడంతో మరణించి ఉండొచ్చని చెబుతున్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు యు.ఏసుబాబు, రవ్వారిగూడెం గ్రామస్తులు, బంధువులు నాగరాజు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా నాగరాజు మృతిపై మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంతాపం తెలిపారు.

ఆటోల చోరీ.. నిందితుడి అరెస్టు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంతో పాటు ఇతర జిల్లాల్లో రాత్రి సమయాల్లో ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోలను చోరీ చేస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.విశ్వనాథ్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ములగాల వెంకటేశ్వరావు (పొట్టి) తాడేపల్లిగూడెం తోపాటు ఇతర జిలాల్లో రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు ఉన్న ఆటోలను చోరీ చేస్తుంటాడు. నిందితుడిపై పిఠాపురం, మండపేట, నిడదవోలు తదితర ప్రాంతాల్లో ఆటోలు చోరీ చేసినట్లు కేసులు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సైలు పి.నాగరాజు, బి.శ్రీనివాస్‌లు సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టి ఆటోల చోరీలకు పాల్పడుతున్న ములగాల వెంకటేశ్వరరావును అరెస్టు చేశారన్నారు. ఇతని వద్ద నుంచి రూ.14 లక్షలు విలువ చేసే 7 ఆటోలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ విశ్వనాథ్

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ఏలూరు (టూటౌన్): పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఏలూరు అంజుమన్ మోహాఫీజువల్ ఇస్లాం సంస్థ హాల్లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ సలహాదారుడు మాజీ మండలి చైర్మన్ ఎండీ షరీఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ నల్ల చట్టం అని అది ముస్లింల మనోభావాలను దేశవ్యాప్తంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీ పార్టీకు చెందిన ముస్లిం, మైనారిటీ నాయకులు రాజీనామా చేస్తున్నారా? అనే విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాజీనామాలు చేయడంలో ప్రయోజనం ఉండదని పార్టీలో ఉండే తమ హక్కులు సాధించుకుంటామని అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి 41 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నారని తెలిపారు. వీళ్ళకి గతంలో ఏలూరులో వ్యాక్సినేషన్ సౌకర్యం ఉండేది కాదని యునైటెడ్ ఏలూరు అండ్ వెస్ట్ గోదావరి హజ్ సర్వీసె సొసైటీ వారు ముందుకు వచ్చి ఈ కార్యక్రమం పెట్టడం అభినందనీయమన్నారు. హజ్ యాత్రకు వెళుతున్న వారికి లక్ష రూపాయలు సబ్సిడీ కూడా ఇస్తున్నామన్నారు. తొలుత అంజుమాన్ సంస్థ అధ్యక్షుడు జబివుల్లా కమిటీ, సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షేక్ నసిరుద్దీన్ కమిటీ నాయకులు ఎండీ షరీఫ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హజ్ సర్వీసెస్ సొసైటీ ఎస్‌కే నాగూర్ జానీ, జనరల్ సెక్రెటరీ ఎండీ ఖాలిద్ అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఎండీ హుస్సేన్ షరీఫ్, ట్రెజరర్ ఎస్.కె జావీర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు ఎండీ షరీఫ్

ఎలక్ట్రిక్ స్కూటర్ల చోరీ.. ముగ్గురు నిందితుల అరెస్టు

రూ.10 లక్షల విలువైన 22 వాహనాల స్వాధీనం

మధురానగర్ (విజయవాడసెంట్రల్): ఎలక్ట్రిక్ స్కూటర్‌లను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద 22 ఎలక్ట్రిక్ స్కూటర్‌లను స్వాధీనం చేసుకున్నామని సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్ తెలిపారు. స్థానిక మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఎస్‌కే బాషా (35), ఉండికి చెందిన జక్కంశెట్టి దుర్గాప్రసాద్ (26), విజయవాడ వాంబేకాలనీకు చెందిన సయ్యద్ యూసఫ్ (28) స్నేహితులు. కారు డ్రైవర్‌గా పనిచేసే బాషా వచ్చే ఆదాయం సరిపోక ఎలక్ట్రిక్ స్కూటర్ రిపేరింగ్ నేర్చుకుని మెకానిక్ షాపు పెట్టుకున్నాడు. అందులోనూ ఆదాయం అంతంత మాత్రంగా ఉండటంతో తాను నేర్చుకున్న విద్యను ఉపయోగించి ఎలక్ట్రిక్ స్కూటర్‌లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. తన స్నేహితులైన దుర్గాప్రసాద్, యూసఫ్‌తో కలిసి చోరీలు ప్రారంభించారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, కైకలూరు, తాడేపల్లి, విజయవాడ తదితర ప్రాంతాల్లో 22 వాహనాలను చోరీ చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలక్ట్రికల్ స్కూటర్‌ల చోరీపై పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన పోలీసులు మాచవరం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రకాష్ తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్ స్కూటర్‌ల చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ నెల 21న మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈఎస్‌ఐ హాస్పిటల్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ఈవీ స్కూటర్లపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారు చేస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్‌ల చోరీల విషయం బయటపడింది. వారు దొంగిలించిన 22 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రిక్ స్కూటర్లు

డిప్యూటీ సీఎం ఇలాకాలో సాంఘిక బహిష్కరణ సిగ్గుచేటు

దెందులూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గం లో మల్లం గ్రామంలో దళిత కుటుంబాన్ని పెత్తందారులు సామాజిక బహిష్కరణ చేయడం సిగ్గుచేటని ఏలూరు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు తెర ఆనంద్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాద్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మోరు రామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శులు గొల్ల కిరణ్ దేవదాసు ప్రేమ్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ షాక్ వల్ల దళితుడు సురేష్ మృతి చెందడం, అతనికి న్యాయం చేయాలని దళితులు, గ్రామస్తులు, మద్దతుదారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం, మద్దతు తెలియజేయడం నేరమా? అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఉప ముఖ్యమంత్రి స్పందించకపోవడం దళితులపై ఆయన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు



తణుకులో మానవత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం (ఫైల్)



తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

- తణుకులో దాతల సహకారంతో విరాజిల్లుతున్న వైనం
- నిత్యం వేలాదిమంది ప్రయాణికులకు ఉపశమనం

తణుకు అర్బన్: మండుతున్న ఎండలకు తోడు ఉక్క పోత వాతావరణానికి ప్రయాణికుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితుల్లో ఎండలకు తోడు వేడిగాల్పుల తీవ్రతకు ప్రయాణికులు సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఎండవేడిని తట్టుకోలేక చాలా మంది తమ ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, పనులకు వెళ్లే కార్మికులు రోడ్డుపై ప్రయాణాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలివేంద్రాలు కనిపిస్తే చాలు వెంటనే ఆగి నాలుగు గ్లాసులు నీరు, మజ్జిగ తాగి అలసట తీర్చుకుంటున్నారు. ప్రస్తుతం తణుకులో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాయి.

కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో...

గత ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి కారుమూరి ఆధ్వర్యంలో కారుమూరి సేవాసమితిచే తణుకు నియోజకవర్గంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు వెలిశాయి. తణుకు మునిసిపాలిటీతో పాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో సుమారుగా 20కి పైగా చలివేంద్రాల ద్వారా మజ్జిగ, తాగునీరు అందజేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చలివేంద్రాల ఊసే లేకుండా పోయిందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. మే నెల వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఎండలు ముదిరిన నేపథ్యంలో ప్రభుత్వం చలివేంద్రాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని తణుకువాసులు కోరుతున్నారు.

దాతల సహకారంతో..



మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో దాతలు చిట్టూరి సుజాత, గోకవరపు కాశీ విశ్వేశ్వరరావులు చెరొక రూ. 10వేలు అందజేయడంతో తణుకు వేల్పూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆర్థిక సాయంతో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నాం. స్వయంగా మానవత సంస్థ సభ్యులు నిత్యం చలివేంద్రంలో ప్రయాణికులకు మజ్జిగ అందిస్తూ సేవ చేస్తున్నారు.

– కోడూరి రాధా పుష్పవతి, మానవత అభివృద్ధి కమిటీ స్టేట్ కన్వీనర్

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు



తణుకు మండపాక రోడ్డులో నిత్యం వేలాదిమంది మండపాక మీదుగా అత్తిలి మండంలోని పలు గ్రామాలకు, తణుకువైపు ప్రయాణాలు చేస్తుంటారు. ఈ వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది మాదిరిగానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాను. ప్రయాణికులు ఆగి మంచినీరు తాగి వెళ్తున్నారు.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్ సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

క్లుప్తంగా

ఘనంగా చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


కొమ్ముగూడెం గ్రామంలో చల్లాలమ్మ వారికి అధివాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ దేవత చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం ఇత్యాది అధివాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పుట్టినిల్లు, అత్తారింటి వారు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్


తణుకులో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: తణుకు పట్టణంలోని అజ్జరం రోడ్డులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఆదుర్తి సాయిబాబా (38) అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా కిళ్లీ కొట్టులో అమ్మకాల నిమిత్తం ఉంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సాయిబాబాను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి వేడుకలు


లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇరగవరం: లెనిన్ ఆశయ సాధనకు అందరూ పునరంకితం కావాలని సీపీఐ జిల్లా నాయకుడు నామన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోషలిస్టు విప్లవకారుడు లెనిన్ 155వ జయంతి సందర్భంగా మంగళవారం తూర్పు విప్పర్రు సీపీఐ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలలో శ్రామిక, సోషలిస్టు ప్రభుత్వాల ఏర్పాటుకు దిక్సూచిగా లెనిన్ నిలిచాడని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నామాన వెంకటేశ్వరరావు, అడ్డాల సత్యనారాయణ, గిద్ద సూర్యనారాయణ, కుడిపూడి వెంకటరెడ్డి, గుడిమెట్ల కోటేశ్వరరావు, బందెల నాగేశ్వరరావు, విప్పర్తి జయరాజు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

కాళ్ల: పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. కాళ్ల మండలం సీసలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ గణేశ్న పెదవెంకటరత్నం రూ.1.20 లక్షల విలువైన వాటర్ కూలర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు మేధస్సును పెంచుకోవాలి

ఆకివీడు: విద్యార్థులు మేధస్సుకు పెంచుకొని, చదువుతోపాటు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు వెళ్లాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. విద్యా దినోత్సవ సందర్భంగా స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను కనబరిచాలన్నారు. కౌన్సిలర్ కట్టా రవి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాభ్యాసం కొనసాగించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.

భూ పరిరక్షణ అందరి బాధ్యత

ఆకివీడు: భూ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎస్సై హనుమంతు నాగరాజు అన్నారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో ధరిత్రి దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, పాలిథిన్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. పచ్చని చెట్లు ఆరోగ్యానికి మెట్లు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం ఎస్సై నాగరాజు మాట్లాడుతూ పంచభూతాల్లో అగ్ని తప్ప అన్నీ కలుషితమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యానికి కారణం మనమేనన్నారు.

సర్కారు బడుల్లో చదివించండి


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భారత్ స్కౌట్స్, అండ్ గైడ్స్ విభాగం వారిచే పట్టణంలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ జరిగింది. స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులచే ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యను అందజేస్తున్నట్లు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. స్కౌట్ టీచర్ గణపతిరావు, గైడ్ కెప్టెన్ పి.వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం సత్యనారాయణ పర్యవేక్షించారు. స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో అన్నసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జైభీమ్ యూత్ సభ్యులు తెలిపారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జై భీమ్ యూత్ సభ్యులు ఉర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం


32వ వార్డులో పౌష్టికాహారం ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


జగన్నాథపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని ఐడీడీఎస్ ప్రాజెక్టు అధికారి టీఎల్ సరస్వతి తెలిపారు. పోషణ పక్వాడాలో భాగంగా మంగళవారం స్థానిక 32 వవార్డులో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు విధిగా పోషకాహారం తీసుకోవడంతో పాటు చిన్నపాటి శారీరక వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, పిల్లల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె విశాలాక్షి, కె భవాని తదితరులు పాల్గొన్నారు.

గృహిణులకు వ్యాయామం తప్పనిసరి

ఇరగవరం: శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గృహిణులు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సీడీపీఓ ప్రమోదకుమారి తెలిపారు. రేలంగి గ్రామంలో మంగళవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రమోదకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. లోప పోషణ కలిగిన పిల్లలను గుర్తించి, పిల్లలకు ఆకలి నిర్ధారణ పరీక్షలు జరిపారు. గర్భిణులు తీసుకునే ఆహారం గురించి, మునగాకు ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ డీవీ మాణిక్యాంబ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


రేలంగిలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి

పోషకాహార లోపాన్ని అధిగమించడమే లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం, చినతాడేపల్లి, జగన్నాథపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.బేబి, డి.ఎస్తేరు రాణి, కే.శ్రీదేవి, జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక పాల్గొని పోషణ ద్వారా చేకూరే ప్రయోజనాలను గర్భిణులకు వివరించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పాలు, కోడిగుడ్లు, చిక్కీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ పి.విజయలక్ష్మి, దీప్తి, రేఖ, ఏఎన్ఎం జి.రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సహజ ప్రసవాలు జరిగేలా చూడాలి


అత్తిలి పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి గీతాభాయి

అత్తిలి: ఆసుపత్రిలో సహజ ప్రసవాలు ఎక్కువగా అయ్యే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాభాయి వైద్యులకు సూచించారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి అందించాల్సిన సేవలు జాప్యం లేకుండా అందజేయాలని సిబ్బందికి తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న క్యాన్సర్ సర్వేలో క్షేత్రస్థాయిలో ముందస్తు క్యాన్సర్ రోగులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ద్వారా పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఈసందర్భంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ఆమె పలకరించి వారికి వైద్యసేవలు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ఆర్ సురేఖ, సీహెచ్‌ఓ పి మురళి, హెచ్‌ఈ జి ప్రమీలా రాణి, హెచ్‌వీ అమ్మాజీ, ఎంపీహెచ్ఏ జెఎస్ గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేలంగి ఆసుపత్రి తనిఖీ

ఇరగవరం: రేలంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి గీతాభాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు రికార్డులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె బంగారురవి, డాక్టర్ పి సాయిగిరిరెడ్డి, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, గురు, తులసీదేవి పాల్గొన్నారు.

భవిత పిల్లలను ఆదరించండి


భవిత పిల్లలతో సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాలీశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత పిల్లలలో లోపాలను చూడవద్దని ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు కోరారు. భవిత సెంటర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వేసవిలో ఇంటి వద్ద తల్లిదండ్రులు, భవిత పిల్లలకు నేర్పించాల్సిన నైపుణ్యాలను అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ ధరిత్రి దినోత్సవం జరిగింది. పేరిచర్ల ఫౌండేషన్ మురళీ కృష్ణంరాజు కార్యక్రమానికి సహకరించారు. ధరిత్రిని కాలుష్య కోరలనుంచి కాపాడుకుందామని, ప్లాస్టిక్ వినియోగంను ప్రతి ఒక్కరూ తగ్గించుకోవాలన్నారు. పర్యవరణ పరిరక్షణకు పాటుపడదామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం బి.జ్యోతి, ఆంజనేయస్వామి, వెంకటేశ్వరరావు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం


తణుకులో విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న మానవత ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి. శ్రీనివాస్ అనే విద్యార్థికి హైదరాబాద్‌కి చెందిన భూపతి రాజు పెద్దిరాజు తన తల్లి కృష్ణవేణి పేరిట రూ. 7వేలు విలువచేసే సైకిల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మానవత తణుకు మండల అధ్యక్షురాలు కటారి శారదాదేవి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పొడగట్లపల్లి నుంచి ఈతకోట వరకు సైకిల్ మీద వచ్చి తణుకు కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థికి ఈ సైకిల్‌ను దాతలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, తణుకు మండలం కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, పూర్వపు అధ్యక్షుడు నెక్కంటి నాగేశ్వరరావు, సభ్యులు ఖ.. భూపాల్ నిడదవోలు సత్తిరాజు, పూలమాల వీరభద్రం, అడ్డగర్ల వెంకటేశ్వరరావు, కె మణిదీప్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



భూమిని కాపాడుకుందాం అంటూ ర్యాలీ నిర్వహించిన హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

తణుకు అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు వక్తలు తెలిపారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ ఎర్త్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈవో డి.మురళి సత్యనారాయణ మాట్లాడుతూ మానవాళి మనుగడకు సహకరిస్తున్న భూమి ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం నేలను సారవంతంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎంఈఓ 2 జీబీవీ ప్రసాద్, మండల వనరుల కేంద్రం సిబ్బంది, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్


పోలీసులతో మాట్లాడుతున్న షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. కోర్టు సముదాయం భవనాల సమావేశ మందిరంలో మంగళవారం సికిందర్ బాషాచే పోలీస్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి బాషా మాట్లాడుతూ కక్షిదారులు రాజీ పడదగిన కేసులను తప్పక రాజీ చేసుకోవాలని, లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఎక్కువ కేసులు కక్షిదారులు రాజీ చేసుకునే విధంగా పోలీసులు చూడాలని తెలిపారు. కక్షిదారులు రాజీ చేసుకునే విషయంలో పోలీసులకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుంధతిలు మాట్లాడారు. అన్ని కోర్టుల పరిధిలోని పోలీస్ స్టేషన్లు సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


గోపినాథపట్నంలో హోమాలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: మండలంలోని గోపినాథపట్నంలో భ్రమరాంభిక మల్లేశ్వరస్వామి ,శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం కొనసాగాయి. గణపతి పూజ, గోపూజ, చండీ సప్త శతిపారాయణము–హోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు భారీగా నిర్వహించడంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బ్రహ్మశ్రీ చక్రవర్తి బ్రహత్వంలో ఈపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులుతో పాటు కొట్టు మరళి దంపతులు, కుటుంబ సభ్యులు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెంటపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెంటపాడు మండలం విప్పర్రు గ్రామంలో ఆర్‌బీకే కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిబ్బంది మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. పండించిన పంటకు సరైన ధర వచ్చేలా రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా రైతు సేవాకేంద్రాలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. ధాన్యం ఎక్కువగా ఆరబెడితే నూక అయ్యే అవకాశం ఉందన్నారు. 17 శాతం తేమ మించకుండా రైతు సేవాకేంద్రం ద్వారా విక్రయించుకోవాలన్నారు. తహసీల్దార్ సీతారత్నం, మండల వ్యవసాయాధికారి పార్థసారది, సొసైటీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో దుర్గ, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం


ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో మాట్లాడుతున్న కరిబండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కైండ్‌నెస్, లయన్స్‌క్లబ్, ఆరా ఫౌండేషన్ సంయుక్తంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం పట్టణంలోని విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి రక్షణపై అవగాహన చేసేందుకు కంట్రోల్ ప్లస్ ఎస్ మిషన్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లబ్ డైరెక్టర్ కరిబండి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కేవీ రామారావు, కైండ్‌నెస్ క్లబ్ అధ్యక్షుడు గట్టిం ప్రవీన్ కృష్ణ, పిల్లా వెంకన్నలు మాట్లాడుతూ గత సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి తీవ్రత ఉన్న సంవత్సరంగా నమోదు అయ్యిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భూమిపై మనిషి జీవించడం కష్టంగా మారుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగంపై యుద్ధం చేయాలని తెలిపారు. మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం పెంచడం, ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. మొక్కలు నాటాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో వివిధ ఔషధ, ఫల, నీడను ఇచ్చే మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టి.పాండురంగారావు, గ్రంధి ప్రసాద్, బొద్దు అరుణ, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయండి


తణుకులో పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

తణుకు అర్బన్: మేడే, మే 20న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో సీఐటీయూ నాయకులు ఉండ్రాజవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన సీఐటీయూ మండల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపిలు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు చేస్తే కార్మికులు బానిసలుగా మారడం ఖాయమని, ఎన్నో పోరాటాలు ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కుల జోలికి ఎవరు వచ్చిన కుదరదని అన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులను శ్రమదోపిడీ చేసి కార్పొరేట్లకు దోచి పెడుతుందని విమర్శించారు. మే 20న కార్మికుల సత్తా ఏంటో మోదీకి చూపించాలని తెలిపారు. ఈ సమావేశం అనంతరం లేబర్ కోడ్స్‌పై సీఐటీయూ వేసిన బుక్స్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వల్లూరి వెంకటేశ్వరరావు, అజయ కుమారి, పీడీ.మూర్తి, గార రంగారావు, రమేష్, రామకృష్ణ, అయ్యప్ప, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అలంపురంలో ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 24న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, అంకాలజీ, గైనకాలజీ, పిడియాట్రిక్‌కు చెందిన నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.